## క్లుప్తంగా

### బాధితులకు భోజనం



**పెనుగంచిప్రోలు:** మునేరు వరదకు ఇళ్లలోకి నీరు చేరటంతో స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ సత్రాల్లో పునరావాస సదుపాయం కల్పించారు. వారికి ఆలయం తరఫున అల్పాహారం, భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ఈకార్యక్రమం చేపట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

### ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

**కంచికచర్ల:** మండలంలోని గండేపల్లిలో ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా సెంటినీ కర్మాగారం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు తాగునీటిని సరఫరాచేశారు. ఇటీవల భారీగా కురిసిన వర్షానికి రక్షిత మంచినీటి పథకం ద్వారా ఏర్పాటు చేసిన విద్యుత్‌మోటార్లు పనిచేయకపోవటంతో గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం గురించి సర్పంచి బీ రవికుమార్, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని గ్రామంలో సరఫరా చేశారు. పంచాయతీ కార్యదర్శి జే రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### బురద తొలగింపు

**పెనుగంచిప్రోలు:** మునేరు భారీ వరదకు గ్రామంలోని 5వ వార్డుతో పాటు పలు వీధుల్లో బురద పేరుకు పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో మంగళవారం సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది డ్రోజర్ సాయంతో బురదను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్, మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు కాకాని పద్మ, స్థానిక నాయకులు రంగిశెట్టి దుర్గాప్రసాద్, చెక్కా వెంకటమరమణ, ఆర్.గోపి, అప్పాజీ పాల్గొన్నారు.

### మరమ్మతు పనుల పరిశీలన

**నందిగామ టౌన్:** మూడు రోజులుగా కురిసిన వర్షాలకు తోడు ఎగువ నుంచి వచ్చిన వరదకు దెబ్బతిన్న పట్టణ సమీపంలోని పల్లగిరి మునేటిలో ఉన్న రక్షిత మంచి నీటి పథకం పైప్‌లైన్‌లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. పల్లగిరి రోడ్డులో జరుగుతున్న మరమ్మతు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునేటిలోని రక్షిత మంచి నీటి పథకం మోటార్లు బాగానే ఉన్నాయని, పైప్‌లైన్ దెబ్బతినటంతో మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు. కీసర మునేటిలోని పథకానికి విద్యుత్ సరఫరా లేకపోవటంతో జనరేటర్‌లతో తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఏఈ ఫణిశ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మురుగు తొలగించండి

**కంచికచర్ల:** మండలంలోని గనిఆత్కూరులో గ్రామంలో వరద ప్రభావం కారణంగా రోడ్లపై మురుగు మేట వేసింది. మురుగు పేరుకుపోయిన రోడ్డుపై నడవాలంటే కాలు జారి పడతామేమోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి గ్రామంలోకి వరదనీరు వచ్చింది. కానీ వరద తగ్గుముఖం పట్టినా గ్రామంలో లోతట్టుగా ఉన్న ప్రాంతాల్లో వరదనీరు నిలిచే ఉంది. రోడ్డుపైన మురుగును తొలగించకుండా గ్రామంలో పంచాయతీ పాలకులు బ్లీచింగ్, సున్నం చల్లుతున్నారు. దీంతో ప్రజలు అసహనానికి గురవతున్నారు. రోడ్డుపై పేరుకుపోయిన మురుగును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### కొట్టుకుపోయిన వాహనాల వెలికితీత



**నందిగామ టౌన్:** మండలంలోని ఐతవరం వద్ద వరద తాకిడికి కొట్టుకుపోయిన 16 కార్లు, ఐదు ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను బయటకు తీసేందుకు మంగళవారం వాహనదారులు యతి్నంచారు. క్రేన్, ట్రాక్టర్‌ల సహాయంతో వాహనాలను బయటకు తీస్తుండటంతో జాతీయ రహదారిపై విజయవాడ-హైదరాబాద్ వైపు కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఒక్కో వాహనాన్ని బయటకు తీసేందుకు రూ.12 నుంచి 15 వేలు వరకు తీసుకున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు సహకారం అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో నందిగామ ప్రజలు తేరుకుంటు న్నారు. ఐతవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపైకి వరద నీరు చేరటంతో నిలిచిపోయిన రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు.

### వరద నష్టంపై అంచనాలు పంపుతాం

**జగ్గయ్యపేట అర్బన్:** వరద ఉధృతికి దెబ్బతిన్న ప్రతి ఇంటికీ అధికారులను పంపిస్తామని, ప్రతి ఇంటికీ వచ్చి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఆ అంచనాలను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. వరద ఉధృతికి జగ్గయ్యపేట-అగ్రహారం పాలేటి బ్రిడ్జి కొంత భాగం దెబ్బతిన్నది. దీంతో మంగళవారం పట్టణ సమీపంలోని అగ్రహారం బ్రిడ్జిని ఎమ్మెల్యే తాతయ్య పరిశీలించారు. మరమ్మతులు వెంటనే చేయాలని అధికారులకు సూచించారు. సమీపంలోని అగ్రహారం గ్రామంలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. వరదల వలన ఆర్థికంగా నష్టపోయిన వారికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు.

# కన్నీరు మిగిల్చిన వరద

- పొలాల్లో పంట మునక, మేటవేసిన ఇసుక
- దారుణంగా దెబ్బతిన్న రోడ్లు
- కొట్టుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు
- ఆదుకోవాలని రైతన్నల వినతి



రహదారి కొట్టుకు పోవటంతో ఇసుక మేట వేసిన పొలాల్లో నుంచి నడిచి వస్తున్న ముచ్చింతాల ప్రజలు

**పెనుగంచిప్రోలు/వత్సవాయి:** భారీ వర్షాలు ప్రజలను కష్ట, నష్టాలపాలు చేశాయి. మునేరు వరద బీభత్సానికి పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. పత్తి, మిర్చి తోటలు కూడా ఘోరంగా దెబ్బతిన్నాయి. మునేరు తువ్వకాలువకు పలు చోట్ల గండ్లు పడటంతో వందల ఎకరాల్లో వరి పొలాలు ఇసుక మేట వేశాయి. కోట్ల రూపాయలతో నిర్మించినరోడ్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. విద్యత్ స్తంభాలు కొట్టుకుపోయాయి. దీంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**సహాయక చర్యలు శూన్యం**

**జగ్గయ్యపేట:** గత మూడు రోజులుగా వరద నీటిలోనే మండలంలోని బూదవాడ, రెడ్డినాయక్‌తండ గ్రామాల్లోని ఎస్టీ, ఎస్సీ కాలనీలలో వరద నీరు నేటికీ ఇళ్ల మధ్యనే ఉండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పాలేరు నది పక్కనే ఉండటంతో పెద్ద ఎత్తున వరద రావటంతో ఆ ప్రాంతమంతా పది అడుగుల మేర వరద నీరు నిలిచింది. నీరు బయటకు వెళ్లకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 50కి పైగా ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెవెన్యూ, పంచాయతీ అధికారులు గ్రామాల్లోకి వచ్చి సహాయ చర్యలు చేపట్టటం లేదని ప్రజలు వాపోతున్నారు. రెండు గ్రామాలలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో అంధకారం అలుముకుంది. బూదవాడలోని గ్రామ సచివాలయాన్ని వరద నీరు చుట్టుముట్టటంతో సచివాలయం పాక్షికంగా దెబ్బతింది.



బూదవాడలో కూలిన ఇళ్లు

**కోతకు గురైన రహదారి**

**నందిగామ టౌన్:** వైరాకట్టలేరు, మున్నేటికి భారీగా వరద నీరు రావటంతో మండలంలోని దాములూరు కూడలి వెళ్లే రహదారి కోతకు గురై పూర్తిగా ధ్వంసమైంది. ఈ రహదారిలో నాలుగు చోట్ల రహదారి కోతకు గురవగా మిగిలిన రహదారిలో సగ భాగం పూర్తిగా ఛిద్రమైంది. రహదారి ధ్వంసమవటంతో నందిగామ-వీరులపాడు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలు సైతం నేలకొరిగాయి. దీంతో విద్యుత్ శాఖాధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు.



పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు వద్ద నీట మునిగిన వరి పొలాలు



కోతకు గురైన దాములూరు కూడలి రహదారి



స్వల్పంగా దెబ్బతిన్న సచివాలయం



దారుణంగా దెబ్బతిన్న అనిగండ్లపాడు-గుమ్మడిదుర్రు రహదారి



వరద ప్రవాహానికి కొట్టుకు పోయిన వత్సవాయి మండలం రేగులగడ్డ రహదారి



వరద ప్రవాహానికి నేలవాలిన వరిపొలం వద్ద రైతు రామారావు



విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేయిస్తున్న ఏఈ పూర్ణచంద్రరావు

### వరద బాధితులందరికీ న్యాయం జరుగుతుంది

**జగ్గయ్యపేట అర్బన్:** వరద ఉధృతికి గురై నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక మఠం శివాలయం పరిసర ప్రాంతాలలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా వరద కారణంగా నష్టపోయిన వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. సచివాలయం సిబ్బంది ప్రతి ఇంటికీ వచ్చి జరిగిన నష్టాన్ని నమోదుచేసుకుంటారని తెలిపారు. జలప్రళయం త్వరగా తగ్గాలని కోరుతూ మఠం శివాలయంలో చైర్మన్ పూజలు చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ గొట్టె నాగరాజు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

### గండేపల్లిలో పారిశుద్ధ్య పనులు


**కంచికచర్ల:** ఇటీవల కురిసిన వర్షానికి వీధులన్నీ మురికికూపాలుగా తయారయ్యాయి. దీంతో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యం చర్యలు చేపట్టారు. ఏ వీధి కెళ్లినా దుర్వాసన వస్తుందని అందుకే గ్రామంలో బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లి వీధుల్లో మంగళవారం బ్లీచింగ్, సున్నం చల్లించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజుల నుంచి కుండపోతగా వర్షం కురిసిందని, దీంతో గ్రామంలో మురుగునీరు నిల్వ ఉందని తెలిపారు. అందుకే బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామన్నారు. దోమల నివారణకు రాత్రి సమయాల్లో ఫాగింగ్ చేయిస్తున్నామని అన్నారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### కొనసాగుతున్న రాకపోకలు

**జగ్గయ్యపేట:** మండలంలోని గరికపాడు సమీపంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రాకపోకలు వన్‌వే ద్వారా సాగుతున్నాయి. రెండు రోజుల క్రితం హైదరాబాద్-విజయవాడ రహదారి పాలేటినదిపై కోతకు గురి కావటంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అయితే వన్‌వే ద్వారా వాహనాల రాకపోకలకు అనుమతించారు. రాకపోకలను ఇరు రాష్ట్రాల పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

## వరద ముంపులోనే పంట పొలాలు

- నేలవాలిన మొక్కజొన్న.
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు



జుజ్జూరులో నేలవాలిన మొక్కజొన్న పంట



వెల్లంకిలో వరద నీటిలో దర్శనమిస్తున్న కంది పంట



జగన్నాథపురంలో మొలకలెత్తిన పెసర పంట

**వీరులపాడు:** గడిచిన మూడు రోజులుగా కురిసిన వర్షాలకు తోడు ఎగువ నుంచి వచ్చిన వరద కారణంగా మండలంలోని వైరాకట్టేలేరు, ఏనుగు గడ్డ వాగు పొంగడంతో పంట పొలాలు నీట మునిగాయి. వరి, పత్తి, మిర్చి, మినుము, మొక్కజొన్న, పెసర పంటలు నేటికీ వరద నీటి ముంపులోనే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వైరా కట్టెలేరు పరీవాహక గ్రామాలైన కొణతాలపల్లి, వెల్లంకి, పల్లంపల్లి, వీరులపాడు, జయంతి, దొడ్డదేవరపాడు, వీఅన్నవరం, గ్రామాలతో పాటు ఏనుగు గడ్డ వాగు సమీప గ్రామాలైన పెద్దాపురం, జుజ్జూరు, చెన్నారావుపాలెం, నరసింహారావుపాలెం గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న పంట నేలవాలింది.

**ప్రభుత్వం ఆదుకోవాలి..**

ఈ ఏడాది ఎంతో ఆశతో పంటలు సాగు చేసినప్పటికీ అకాల వర్షాలు, వరదలు కన్నీరే మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలకు వేలు పెట్టుబడి సాగు చేశామని కనీస దిగుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి, పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ప్రజలను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

అత్యవసర సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



**జగ్గయ్యపేట అర్బన్:** ప్రకృతి వైపరీత్యాల సమయంలో కష్ట కాలంలో ఉన్న పట్టణ ప్రజలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, సచివాలయాల శాఖల అధికారులతో చైర్మన్ రాఘవేంద్ర అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది 4వ తేదీ నుంచి వరద ముప్పు ప్రాంతాలలో ప్రతి ఇంటికీ వెళ్లి జరిగిన నష్టాన్ని నమోదు చేయాలన్నారు. పట్టణ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు అత్యవసర పనుల వివరాలు ఇవ్వాలని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య వరద ముంపు ప్రాంతాలలో పర్యటిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారని తెలిపారు. పరిస్థితులు చక్కబడే వరకు సెలవులు పెట్టకుండా పట్టణ పరిధిలో ఉండాలన్నారు.

**బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్**

మున్సిపల్ కమిషనర్ గత నెల 31న ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో వచ్చిన మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావును చైర్మన్ రాఘవేంద్ర సత్కరించారు. పట్టణ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 400 హెక్టార్లలో పత్తి పంట నష్టం



**వత్సవాయి:** మండలంలోని మక్కపేట, వత్సవాయి, చిట్టేలలో దెబ్బతిన్న పంటలను కేవీకే శాస్త్రవేత్తలు పరిశీలించారు. కేవీకే శాస్త్రవేత్తలు బి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజశేఖర్, కేలక్ష్మీకళ, ఏడీ ఏ సి.భవాని మాట్లాడుతూ మండలంలో 652 హెక్టార్లలో వరిసాగు 180 హెక్టార్లలో పంట పోయిందన్నారు. పత్తిపంట 2,644 హెక్టార్లలో సాగుచేయగా 400 హెక్టార్లలో పంట మునిగింది. పెసర 20, మినుము 6, మొక్కజొన్న 23 హెక్టార్లలో, మరో 12 హెక్టార్లలో కూరగాయ పంటలు దెబ్బతిన్నాయనిఅంచనా వేశామన్నారు. వర్ధినీకుమారి, రవికుమార్ పాల్గొన్నారు.



# తీరని వరద కష్టాలు



జగ్గయ్యపేట-ముక్త్యాల రహదారిలోని పాలేటిపై ధ్వంసమైన వంతెన



అన్నవరం-బలుసుపాడు రహదారిలో పూర్తిగా శిథిలమైన వంతెన

**జగ్గయ్యపేట:** మున్నేరు, పాలేటికి వరద కారణంగా పలు గ్రామాలలో వంతెనలు ధ్వంసం అయ్యాయి. వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. వరి, పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బదిన్నాయి. పంట పొలాలపై ఇసుక మేటు వేసి ఎడారులను తలపిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ మోటార్లు కొట్టుకుపోయాయి. విద్యుత్ సరఫరా లేక, తాగేందుకు నీరు లేక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అన్నవరం గ్రామానికి చెందిన దాచేపల్లి నారాయణ అనే రైతుకు చెందిన ట్రాక్టర్ వరద ఉధృతికి కొట్టుకుపోయింది. గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు మరో రెండు రోజులు పడుతుందని అధికారులు అంటున్నారు. పలు ప్రాంతాలలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పర్యటించారు. అదే విధంగా చిల్లకల్లు ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్‌రెడ్డి నాయక్‌తండాలో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. పాలేటిపై ముక్త్యాల వంతెన ధ్వంసం అవటంతో సాయంత్రం సమయంలో కేసీపీ కర్మాగారానికి రాకపోకలు సాగించేందుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ రహదారి కావటంతో తాత్కాలిక రహదారి నిర్మిస్తున్నారు.



రెడ్డినాయక్‌తండాలో ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ



నామరూపాలు లేకుండా పోయిన రెడ్డినాయక్ తండ-బూదవాడ అప్రోచ్ రోడ్డు



అన్నవరంలో నామరూపాలు లేకుండా పోయి రాళ్లు దర్శనమిస్తున్న వరి పొలం



జగ్గయ్యపేట బైపాస్ వద్ద కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

### ప్రభుత్వం ఆదుకోవాలి..



పాలేటికి వచ్చిన వరద ఉధృతికి వందల ఎకరాలలో వరి పంటకు నష్టం వాటిల్లింది. ఆరు ఎకరాలలో వరి సాగు చేస్తే ఒక్కరోజులోనే వరదకు కొట్టుకుపోయింది. వ్యవసాయాధికారులు గ్రామంలో పర్యటించి పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం అందించాలి.

–తిక్కల వెంకటేశ్వరరావు, అన్నవరం

### వెంటనే పరిహారం అందించాలి



పాలేటికి వచ్చిన వరద ఎన్నడూ చూడలేదు. పాలేటి ఆయకట్టులోని వరి, పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం రైతులను ఆదుకుని నష్ట పరిహారం అందించాలి. మోటార్లు కూడా కొట్టుకుపోయాయి, ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

–చిగురుపాటి రవి, అన్నవరం